ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శనివారం 26 సెప్టెంబర్ 2026

## రూ.3 లక్షల 15 వేలకు పలికిన సబ్జి మండి గంగపుత్ర సంఘం వినాయక లడ్డు



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** సబ్జి మండి లోని గంగపుత్ర సంఘం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక లడ్డు వేలంపాటలో పిట్టల సుజన్ 315000 లకు లడ్డును కైవసం చేసుకున్నారు. గణేష్ ఉత్సవ సమితి చైర్మన్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు దోర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణు బాబు,గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు నాసా సుధాకర్,ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీకాంత్,చింత శ్రీకాంత్,గణేష్ ఉత్సవ సమితి కోశాధికారి నాసా ప్రణయ్,పల్లెల సాకేత్,గంగపుత్ర సంఘం సభ్యులు పిట్టల సుజన్ ఘనంగా సన్మానం చేశారు.

## సేల్స్‌ఫోర్స్‌తో క్రిస్ట్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** ప్రపంచంలోని ప్రముఖ 1 ఏజెంటిక్ ఏఐ సిఆర్ఎం సంస్థ అయిన సేల్స్‌ఫోర్స్తో క్రిస్ట్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) విశ్వవిద్యాలయం భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా, 'సేల్స్‌ఫోర్స్ ఏఐ ఇన్నోవేషన్ ల్యాబ్' 'అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలను ప్రారంభించనున్నారు.ఆధునిక ప్రపంచానికి అవసరమైన ఏఐ డిజిటల్ టెక్నాలజీ ఎంటర్‌ప్రైజ్ సంబంధిత పరిజ్ఞానాన్ని విద్యార్థులు, అధ్యాపకులకు అందించి,వారిని ప్రస్తుత పరిశ్రమకు తగినవారిగా తీర్చిదిద్దడమే ఈ భాగస్వామ్యంలోని ప్రధాన ఉద్దేశం అని పేర్కొంది. ఏఐ విద్య,పరిశోధన ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీకి ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదగాలన్న క్రిస్ట్ విశ్వవిద్యాలయం ప్రయాణంలో ఇది ఒక మైలురాయనీ వెల్లడించింది.

# జన సాహిత్య అకాడమీ ఉత్తమ అవార్డులకు ఆహ్వానం



**హైదరాబాద్, (ప్రజా వినికిడి):** "జన సాహిత్య అకాడమీ" ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్తమ అవార్డులకు ఆహ్వానించడం జరుగుతుందని జన సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు పాముల రమణ హిమాయత్ నగర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం కొనసాగుతూ ప్రజా సంక్షేమము కోసం పోరాడుతున్న నాయకులకు, మహనీయుల పోరాటాలను ప్రజలకు తెలియ జేస్తు యువతకు స్ఫూర్తిని కలిగించే నాయకులకు, విద్యా,వైద్య, సాహిత్య కళా సంస్కృతి, రచన,నటన, నాట్య రంగాలు, స్వచ్ఛంద సేవకులకు, ఇతర ప్రజా సంబశీదాలు కలిగిన వయో వృద్ధ ఫౌండేషన్ ఉచిత అన్న దాన ట్రస్టులకు ఇవ్వడం జరుగుతుంది. అలాగే వివిధ రంగాలలో ప్రావీణ్యత గల వారికి ఉత్తమ జాతీయ స్థాయిలో అవార్డ్స్ ను జన సాహిత్య అకాడమీ ద్వారా గుర్తించి ఇవ్వబడును. జన సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు పాముల రమణను పూర్తి వివరాల కొరకు చరవాని నంబర్ 9959531229 సంప్రదించాలి.

### షాద్ నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో

# ఆర్థిక సహాయం అందజేత..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** మున్నూరు కాపు సంఘం షాద్ నగర్ తాలూకా ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు మేడిగా పెంటయ్య అధ్యక్షతన పట్టణానికి చెందిన పేద మహిళ మౌనిక పెద్ద కూతురు వివాహానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది .ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షులు మంచిరేవుల సాయి కృష్ణ,సంఘ కోశాధికారి మల్చలం మురళి,సంఘ సభ్యులు పడకండి శ్రీశైలం,మొదలగువారు పాల్గొని ఆమెకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది.సంఘం ఆధ్వర్యంలో వివిధ సామాజిక కార్యక్రమాలతో పాటు పేద మధ్యతరగతి కుల సోదరులకు విద్యలో మెరిట్ స్కాలర్షిప్ లతోపాటు,సంఘం తరపున పేద ఇంటి ఆడపిల్ల కళ్యాణ నికి పూస్తే మెట్టలు,నగదు రూపేణ ఆర్థిక సహాయ సహకార గత కొన్ని సంవత్సరాలుగా అందిస్తున్నట్లు గౌరవ అధ్యక్షులు మంచిరేవుల సాయి కృష్ణ తెలిపారు.

# ఆదిభట్లలో అక్రమ నిర్మాణాల జోరు..

# హాస్టల్ దందా హోరు..

**రెండంతస్తులకు అనుమతులు..**
**ఐదంతస్తుల నిర్మాణాలు..**

**టీసీఎస్ క్యాంపస్ పరిధిలో నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు.?**

**నోటీసులకే పరిమితమా.. సెటిల్మెంట్లకే ప్రాధాన్యమా.?**

**చైన్ మెన్ నరేందర్ నోటీసులు ఇచ్చిన స్పందన ఏది.?**



చైన్ మెన్ నరేందర్



**ఆదిభట్ల,(ప్రజావినికిడి):** ఆదిభట్ల సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, పత్రికా కథనాలు వెలువడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు మాత్రం ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి వాటిని హాస్టళ్లుగా వినియోగిస్తున్న వ్యవహారాలపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.
రెండంతస్తులకు అనుమతులు తీసుకుని ఐదంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారని,కొన్ని భవనాల్లో నివాస అనుమతులను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని దానితో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ దశలోనే అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి కూల్చివేతలు లేదా కఠిన చర్యలు అసలు కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**టీసీఎస్ క్యాంపస్ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు.?**

ఆదిభట్ల పరిధిలోని టీసీఎస్ క్యాంపస్‌కు సంబంధించిన నిర్మాణాలు, వాటికి మంజూరైన అనుమతులు, నిర్మాణ నిబంధనల అమలు తదితర అంశాలపై డిప్యూటీ కమిషనర్ పూర్తి స్థాయి పరిశీలన చేయవలసిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఏ నిర్మాణానికి ఎంత అనుమతి.? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు.? వినియోగం అనుమతులకు అనుగుణంగానే ఉందా.? అనే అంశాలను టౌన్ ప్లానింగ్ అధికారులు బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

**నోటీసులు.. ఆ తర్వాత సెటిల్మెంట్లా.?**

టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు ఇచ్చినప్పటికీ, అనంతరం కూల్చివేత చర్యలు కనిపించకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులతో ఎలాంటి అంతర్గత ఒప్పందాలు లేవని అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.అక్రమ నిర్మాణదారుల ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చైన్‌మెన్ హెచ్చరికలకూ లెక్కలేదా.?**

అక్రమ నిర్మాణాల విషయంలో చైన్‌మెన్ నరేందర్ సూచనలు, హెచ్చరికలను కొందరు నిర్మాణదారులు అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి."మీ అధికారులతో మాట్లాడుకున్నాంకావాల్సింది ఇచ్చేశాం" అంటూ కొందరు నిర్మాణదారులు ధీమాగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం అధికార యంత్రాంగానికి మరింత ఇబ్బందికరంగా మారింది.
పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా 'డోంట్ కేర్'అన్నట్టుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా.? లేక నోటీసులు, సెటిల్మెంట్లతోనే వ్యవహారం ముగుస్తుందా.? అన్నది వేచి చూడాలి.

# జవహర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు స్వాహా.?

**సర్వే నంబర్ 500లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ స్థానికుల ఆరోపణలు..**

**"ప్లాట్లు కొట్టు.. ప్రభుత్వ స్థలం అమ్మిపెట్టు" అంటూ తీవ్ర విమర్శలు..**

**కాప్రా రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకంటూ ప్రశ్నలు..**

**జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని స్థానికుల డిమాండ్..**





**జవహర్ నగర్, (ప్రజావినికిడి):** జవహర్‌నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 500లోని ప్రభుత్వ స్థలంపై కబ్జా జరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం.. ప్రభుత్వ స్థలాలను గుర్తించి హద్దులు నిర్ణయించి, రికార్డులను రక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతోందని కొంతమంది రాజకీయ నాయకులు పార్టీలను అడ్డం పెట్టుకొని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాలను చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి లక్షలలో అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో "ప్లాట్లు కొట్టు..ప్రభుత్వ స్థలం అమ్మిపెట్టు" అనే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు.

**రెవిన్యూ అధికారుల కనుసైగల్లోనేనా.?**

కాప్రా రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదులు అందితే స్థల పరిశీలన,సర్వే, రికార్డుల పరిశీలన, హద్దుల నిర్ధారణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే జవహర్‌నగర్‌లో జరుగుతున్నట్లు చెబుతున్న ఆక్రమణలపై రెవెన్యూ సిబ్బంది అధికారుల స్పష్టమైన చర్యలు అసలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన భూములు శాశ్వతంగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఇలా జవహర్ నగర్ పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జా జరిగి కొంతమంది స్థానికులు వందల కోట్లు అక్రమంగా సంపాదించారని ఇందులో కాప్రా రెవిన్యూ అధికారుల భాగస్వామ్యం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

సర్వే నంబర్ 500తో పాటు జవహర్‌నగర్ పరిధిలోని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణలు నిజమైతే వాటిని వెంటనే తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి జవహర్‌నగర్ ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణకు ఆదేశిస్తారా.? లేక అంతర్గత ఒప్పందాలతో ప్రభుత్వ స్థలాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నా రెవెన్యూ యంత్రాంగం మౌనంగానే ఉంటుందా.? అనేది వేచి చూడాలి.అధికారుల స్పందన: ఈ ఆరోపణలపై కాప్రా రెవెన్యూ అధికారులు, ఉన్నతాధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు

### విఘ్నేశ్వరుని అనుగ్రహం అందరిపై ఉండాలి.నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పట్టణంలో పదకొండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయక మండపాలను నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఎల్లికట్ట చౌరస్తాలోని ఆయిల్ మిల్‌లో మాధవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు,మిల్ వర్కర్స్ కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.అదేవిధంగా గంజిలో కీర్తి శ్యామ్ ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని దర్శించుకున్నారుగంజిలో వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వాసవి మాత పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గుంత సత్యనారాయణ అధ్యక్షతన ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డితో పాటు అందే బాబాయ్య, ప్యాట అశోక్,శ్రీనివాసాచారి,గజ్జల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,పదకొండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు నిమజ్జనానికి తరలివెళ్తున్న సందర్భంగా స్వామివారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రజలందరికీ విద్య, జ్ఞానం,బుద్ధి,ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు,సుఖసంతోషాలు కలగాలని,జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి శాంతి,సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# షాద్‌నగర్‌లో గణేశ్ ఉత్సవ చెస్ కార్యక్రమం నిర్వహణ

**బాలబాలికల ప్రతిభకు పట్టం.. -తొలి చెస్ ఛాంపియన్‌షిప్‌కు వేదికగా మల్లికార్జున కాలనీ**

**చెస్ ఉత్సవాలలో పాల్గొనాలని ఏసీపీ ని ఆహ్వానించిన చెస్ నిర్వాహకుడు వానరసి జగన్..**



**షాద్ నగర్, (ప్రజావినికిడి):** షాద్ నగర్ పట్టణంలో చదరంగం సందడి మొదలవుతోంది. షాద్‌నగర్ చెస్ అకాడమీ చొరవతో ఈ నెల 27న తొలిసారిగా షాద్‌నగర్ గణేశ్ ఉత్సవ చెస్ ఛాంపియన్‌షిప్2026 ఘనంగా జరగనుంది.మల్లికార్జున కాలనీలోని పతంజలి యోగా మందిర్ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 9 గంటలకు పోటీల శంఖారావం మోగనుంది. పిల్లల్లో దాగున్న చదరంగ ప్రతిభను వెలికితీసి,వారిని ప్రోత్సహించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా షాద్ నగర్ ఏసీపీ లక్ష్మి నారాయణని కలిసి చెస్ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించిన చెస్ టోర్నమెంట్ నిర్వాహకుడు వానరసి జగన్. సానుకూలంగా స్పందించిన ఏసీపీ..ఈ పోటీల్లో అండర్-8 నుంచి అండర్-16 వరకు ఐదు విభాగాల్లో బాలబాలికలు తలపడనున్నారుఉదయం 8.30కే ఆటగాళ్లు రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా,9 గంటలకు లాంఛనంగా ప్రారంభోత్సవం, క్రీడాకారుల సమావేశం జరుగుతుంది.అనంతరం సాయంత్రం 5 గంటల వరకు 25 ప్లస్ 10 సెకన్ల ఇన్‌క్రిమెంట్ టైమ్ కంట్రోల్‌తో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగనున్నాయి.ఈ నెల 26న సాయంత్రం 4 గంటలలోపు నమోదు పూర్తి చేసుకోవాలని చెస్ మాస్టర్ వానరాశి జగన్ తెలిపారు. విజేతలకు మెమెంటోలు, పతకాలు, ప్రశంసాపత్రాలు దక్కనుండగా, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ అందించనున్నారని స్పష్టం చేశారు. ఆటగాళ్లకు ఉచిత భోజన ఏర్పాట్లు కూడా చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి బహుమతుల ప్రదానోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు ఎం.వి.జగన్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 93468 43126 సంపాదించాలని కోరారు.

# జిల్లెడుచౌదరి గూడ మండలంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు..

**ఉత్సవాలలో భాగంగా గణనాథుని దర్శించుకున్న షాద్ నగర్ డిసిపి శిరీష రాఘవేందర్..**



**జిల్లేడుచౌదరిగుడ(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరి గూడెం మండలంలోని గణేష్ నిమజ్జన పర్యవేక్షణలో భాగంగా షాద్ నగర్ డిసిపి శిరీష రాఘవేందర్,సీఐ బి.శ్రీనివాస్,ఎస్సై బి.వెంకటేష్ ఆధ్వర్యంలో మండలంలోని నిమర్జనం పర్యవేక్షణలో భాగంగా చౌదరి గూడెం మండల కేంద్రంలో గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా సామరస్యంతో వినాయక నిమర్జనాలను పూర్తిచేయాలని వినాయక మంటప నిర్వాహకులకు,ప్రజలకు,భక్తులకు సూచించారు.ఈ సందర్భంగా పలు గణేష్ ఉత్సవ ఊరేగింపు బందోబస్తును పర్యవేక్షించారు.

# తిమ్మాపూర్ లో శివాజీ మహారాజ్ యూత్, వినాయక మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** గణపయ్య అనుగ్రహంతోనే సమస్త శుభాలు కలగాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.శుక్రవారం షాద్ నగర్ నియోజకవర్గం లోని కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో శివాజీ యూత్ వినాయక మండపం వద్ద ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెం పల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఏ శుభకార్యం తలపెట్టినా,ఏ నూతన పనిని ప్రారంభించిన అందరికంటే ముందుగా పూజలందుకునే ఆదిదేవుడు విఘ్నేశ్వరుడని,మన జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అడ్డంకులనైనా తొలగించి,విజయ తీరాలకు చేర్చే శక్తి గణనాథునికే ఉందని. బుద్ధికి,సిద్ధికి అధిపతి అయిన ఆ లంబోదరుని అనుగ్రహం ఉంటే కొండంత కష్టమైన మంచులా కరిగిపోతుందని భక్తుల బలమైన నమ్మకమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్,మాజీ కౌన్సిలర్ రాజేందర్ గౌడ్,మాజీ మాజీ ఎంపిటిసి నర్సిమ గౌడ్,నాయకులు రనదీర్,శివ చారి,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.11.30 కోట్లు మంజూరు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి..**



**షాద్ నగర్, (ప్రజావినికిడి):** షాద్ నగర్ నియోజకవర్గం లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మొత్తంగా రూ.11.30 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.మంజూరైన నిధుల ద్వారా ఫరూక్ నగర్ మండలం తో పాటు కొత్తూరు, నందిగామ,జిల్లేడు చౌదరిగుడా, కొందుర్గు,కేశంపేట మండలాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.హెచ్ఎండీఏ ద్వారా రూ.10 కోట్లు మంజూరు కాగా దీనితో మొత్తం 97 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క పనికి ఐదు నుంచి పది లక్షలు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు.అదేవిధంగా జడ్పీ జనరల్ ఫండ్ ద్వారా రూ. 30 లక్షలు మంజూరు అయ్యాయని, దీని ద్వారా వివిధ పనులను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఇక డిఎంఎఫ్టి ద్వారా ఒక కోటి రూపాయలు మంజూరు అయ్యాయని,నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఈ నిధులను ఉపయోగిస్తామని వెల్లడించారు.ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు సొంత భవనాలు సమకూర్చినట్లు తెలిపారు.అదేవిధంగా నందిగామ,జిల్లేడు చౌదరిగుడ మండలాలకు తహసిల్దార్ కార్యాలయ భవనాలను కూడా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీలో నెలకొన్న అన్ని సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

# మధురపూర్ లో రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో ఐమాక్స్ లైట్ ప్రారంభోత్సవం

**ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**హాజరైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి,సినీ నిర్మాత బండ్ల గణేష్**

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు**

**రెడ్డి వినాయక సేవ సమితి ఆధ్వర్యంలో వైభవంగా గణనాథుని నిమర్జన మహోత్సవం..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మధురపూర్ గ్రామంలో ఎమ్మెల్సి నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్ ను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిప్రారంభించారు.మధురపూర్ రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి,ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ హాజరై అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, మధురాపురం రెడ్డి సేవా సమితి అలాగే గ్రామస్తుల కోరిక మేరకు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.తమ కోరిక మేరకు అడిగిన వెంటనే స్పందించి హై మాస్ట్ లైట్ ఏర్పాటు చేయడం పట్ల రెడ్డి సేవా సమితి మరియు గ్రామస్థులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు.అదే విదంగా రెడ్డి వినాయక సేవ సమితి ఆధ్వర్యంలో వైభవంగా గణనాథుని నిమర్జన మహోత్సవాని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు





గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రజలందరు ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో ఉండాలని,నిమర్జన మహోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు,రెడ్డి సవా సమితి సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# ఫరూక్ నగర్ తహసిల్దార్ కు లేఖ రాసిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కాని నరసింహులు..

**మండలంలోని మొగిలిగిద్ద, చౌలపల్లి,ఎలికట్ట గ్రామాలలో సీలింగ్,సర్ ప్లస్ భూముల వివరాలు ఇవ్వాలని లేఖ..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** లేఖలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు పేర్కొన్న వివరాలు షాద్ నగర్ నియోజకవర్గం లోని ఫారుక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన బ్రెజు నందన్ రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి,మురళీధర్ రెడ్డి,రేఖ,విష్ణువర్ధన్ రెడ్డి,వీర బాల్ రెడ్డి,విక్రం రెడ్డి ల పేర గల భూమి నుండి ప్రభుత్వానికి మొగిలిగిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 376,392,827,981,416,383,384,386,387,388, 389,390,392,4,30,334,67,68,69,54,50,51,57 ,58,149,156,157,165,155,113 లలో భూమి,అలాగే చౌల పల్లి గ్రామంలో సర్వేనెంబర్ లు281,282,283,284,278,442,168,370,371 లలో భూమి,అలాగే ఎలికట్ట గ్రామంలో 639,640,641,646,647,648,649,650, 65,65,653,654,655, 656,657,658,659,684,615,631 లలోనీ భూములను రెవెన్యూ డివిజనల్ అధికారి మహబూబ్ నగర్ ఉత్తర్వులను పురస్కరించుకొని ఫరూక్ నగర్ తహసిల్దార్ స్వాధీన స్వాతినాపరుచుకున్నారు.పై భూములు రెవెన్యూ రికార్డుల్లో సీలింగ్,సర్ ప్లస్



భూములుగా నిషేధిత జాబితాలో ఉన్నట్లు చూపించారు ప్రస్తుతం పై సర్వే నెంబర్ల భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయా లేదా ఇతరుల ఆధీనంలో ఉన్నాయా



తెలుగుదేశం పార్టీ
రాష్ట్ర పార్టీ కార్యాలయం
ఎన్.టి.ఆర్.భవన్
రోడ్‌నెం.2,బంజారాహిల్స్
హైదరాబాద్ - 34

పై భూములను రెవెన్యూ డివిజనల్ అధికారి మహబూబ్‌నగర్‌గారి ఉత్తర్వును పురస్కరించుకుని షాద్‌నగర్ తహశీల్దార్ గారు, స్వాధీనపరుచుకున్నారు.

పై భూములు రెవెన్యూ రికార్డులలో సీలింగ్, సర్‌ప్లస్ భూములుగా, నిషేధిత జాబితాలో ఉన్నట్లుగా చూపించారు.

ప్రస్తుతం పై సర్వే నంబరు భూములు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా? లేదా ఇతరుల ఆధీనంలో ఉన్నాయా? దయ చేసి తెలుపగలరు.

(బక్కని నర్సింహులు)
పొలిట్‌బ్యూరో సభ్యులు,
మాజీ ఎమ్మెల్యే షాద్‌నగర్,
తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం

తెలుపగలరని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, తెలుపగలరని ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య కు లేఖ ద్వారా సమాచారాన్ని కోరారు.

# భక్తుల భద్రతే తొలి ప్రాధాన్యత..

**ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఐపీఎస్**

**షాద్‌నగర్ లో నిమజ్జన వేడుకలకు పటిష్ట భద్రత..**

**బొబ్బిలిచెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ తరుణ్ జోషి..**

**సీపీ వెంట డీసీపీ శిరీష రాఘవేంద్ర, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,సిఐ సీతారాంతో పాటు పలువురు పోలీసు అధికారులు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం బొబ్బిలిచెరువులో పరిశీలించారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించిన సీపీ ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
సీపీ వెంట డీసీపీ, షాద్‌నగర్ ఏసీపీతో పాటు పలువురు పోలీసు అధికారులు ఉన్నారు. నిమజ్జన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సీపీ పలు సూచనలు చేశారు.గణేష్ నిర్వాహకులు, భక్తులతో పోలీసులు సహనంతో, సంయమనంతో, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది చేపట్టిన ఏర్పాట్లను కూడా సీపీ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెరువు పరిసరాల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్ నిర్వాహకులతో సీపీ మాట్లాడారు. విగ్రహాలను జాగ్రత్తగా, ఎలాంటి నష్టం కలగకుండా నిమజ్జనం చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది



సూచనలను తప్పనిసరిగా పాటించాలని క్రేన్ నిర్వాహకులకు స్పష్టం చేశారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా పోలీసు, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీపీ ఆదేశించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ,రద్దీ నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# ఎస్సీ,ఎస్టీ హక్కులు,భూ సమస్యలు,సంక్షేమ అంశాలపై కలెక్టర్‌కు వినతులు

## అట్రాసిటీ కేసుల్లో నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు వేగవంతం చేయాలి

### ఎస్సీ /ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు.పెంటనోళ్ళ నరసింహ మాదిగ






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ, అట్రాసిటీ కేసుల పరిష్కారం,భూ సమస్యలు,రిజర్వేషన్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ,సంక్షేమ వసతిగృహాలు,
విద్యార్థులు-నిరుద్యోగ యువతకు స్టడీ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌కు వినతులు సమర్పించారు పెంటనోళ్ల నరసింహ మాదిగ.

అట్రాసిటీ కేసుల్లో నిబంధనల ప్రకారం చర్యలు.
అట్రాసిటీ కేసుల్లో కేసు వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండా కౌంటర్ కేసులు నమోదు చేయడం వల్ల అసలు కేసు ప్రాధాన్యత తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిజమైన కేసుల్లో బాధితుల హక్కులు దెబ్బతినకుండా, తప్పుడు కేసులను కూడా సమర్థించకుండా, ప్రతి కేసును వాస్తవాలు చట్టపరమైన నిబంధనల ఆధారంగా విచారించాలని కోరారు.అట్రాసిటీ కేసుల్లో మూడో వ్యక్తుల జోక్యం,అనధికార మధ్యవర్తిత్వం ద్వారా బాధితులపై ఒత్తిడి ఏర్పడకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
నిందితులపై చట్ట ప్రకారం చర్యలు వేగవంతం చేయాలి,బాధితులకు పరిహారం సకాలంలో అందించాలి.
కేసుల స్వభావం,తీవ్రత, బాధితుల భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయడం, న్యాయస్థానంలో కేసు నమోదు కావడం, విచారణ ప్రారంభం వంటి ప్రక్రియల్లో అనవసర జాప్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ప్రత్యేక న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే
అట్రాసిటీ కేసుల్లో అర్హులైన బాధితులకు అందాల్సిన పరిహారం ఆలస్యం కాకుండా అవసరమైన నిధులు అందుబాటులో ఉంచాలని కోరారు.ప్రత్యేక ప్రజా అభియోగ న్యాయవాదుల ద్వారా కేసుల పురోగతిని పర్యవేక్షించి, విచారణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి,రోస్టర్ పాయింట్ల అమలుపై స్పష్టత ఇవ్వాలి.
ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా దళితులకు సంబంధించిన భూముల రక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.
భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
అలాగే జిల్లాలో రోస్టర్ పాయింట్ల అమలు పరిస్థితి,ఖాళీల వివరాలు,రిజర్వేషన్ అమలుకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని కోరారు.రిజర్వేషన్ల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా రోస్టర్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.
బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేపట్టాలి,ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి.
సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను శాఖల వారీగా గుర్తించి, అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా వాటిని భర్తీ చేసేందుకు సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ప్రతి నెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి,వాటిపై నిర్ణీత సమయంలో చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.

**సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి.**

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నవిమరమ్మతులు అవసరమైనవి, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
శాశ్వత భవనాల నిర్మాణం, అవసరమైన మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం,ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ నివేదిక పంపించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరం కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
విద్యార్థులు,నిరుద్యోగ యువత కోసం స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయాలి
జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉపయోగపడేలా ప్రతి ప్రాంతంలో అవసరాన్ని బట్టి స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.
అధికారిక సమావేశాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి.
ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే అధికారిక సమావేశాల్లో సంబంధిత ప్రజాప్రతినిధులు పాల్గొనేలా సమన్వయం చేయాలని కోరారు.ప్రజల సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి వెళ్లేలా ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజల మధ్య సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
బీఏఎస్ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలి.
ప్రస్తుతం అమలులో ఉన్న బీఏఎస్ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.పథకం అమలులో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సముచిత సమాచారం, దరఖాస్తు అవకాశం, ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ, బాధితులకు సకాలంలో న్యాయం,భూ హక్కుల రక్షణ, విద్య-ఉపాధి అవకాశాల విస్తరణ కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు

# పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు






**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,జీఎస్ఐ డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ పాల్గొని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సేవలను, సిద్ధాంతాలను స్మరించుకున్నారుఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశ సమగ్ర అభివృద్ధి,పేదలు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంత్యోదయ భావనను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశం,సమాజం మరియు ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని ఆయన చూపిన మార్గంలో ప్రతి కార్యకర్త సేవాభావంతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య, బద్దం బాలకృష్ణ గౌడ్,వాస్పరి మల్లేష్, సంజీవరెడ్డి, కాలం శెట్టి లయ, నరేందర్ రెడ్డి, గజ్జల శేఖర్,నల్ల మునేందర్, రాఘవ చారి శ్రీనివాస్, బీజేవైఎం నాగోల్ డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్సూరాబాద్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**మురికి నీటిలో గణేశ విగ్రహాలను నిమజ్జనం చేయకూడదనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన మేరకు మన్సూరాబాద్‌లో ప్రత్యేకంగా నీటి కుంటను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏర్పాటు చేయడం జరిగింది.బోర్ల ద్వారా కుంటలోకి నీటిని సరఫరా చేయడంతో నిమజ్జన సమయంలో నీరు కలుషితం కాకుండా, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఈ కుంట ఉపయోగపడుతోంది. మన్సూరాబాద్ తో పాటు నియోజక వర్గంలో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కుంటలను ఏర్పాటు చేశారు.ప్రతి ఏడాది ఈ కుంటలో వేలాది గణేశ విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేస్తుండటంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, తూర్పాటి చిరంజీవి, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి,బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలిశెట్టిపల్లి గ్రామంలో వైద్య శిబిరం



**వాజేడు,(ప్రజావినికిడి):**
రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎలిశెట్టిపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స ఆరోగ్య సూచనలు అందించడం జరిగింది.
ఈ శిబిరంలో మొత్తం 35 మందిని వైద్యపరంగా పరీక్షించి చికిత్స అందించడం జరిగింది. గ్రామంలో జ్వర లక్షణాలతో బాధపడుతున్న ముగ్గురిని ప్రత్యేకంగా పరీక్షించడం జరిగింది. వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించగా మలేరియా కేసులు ఏవీ నిర్ధారణ కాలేదు. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.అలాగే గ్రామంలోని స్కూల్ పిల్లలకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించడం జరిగింది. చిన్నపిల్లలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.శిబిరానికి వచ్చిన వారికి చిన్నచిన్న చిరు అనారోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్స అందించడం జరిగింది.ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అదేవిధంగా కాచి చల్లార్చిన లేదా సురక్షితమైన తాగునీటిని మాత్రమే ఉపయోగించుకోవాలని, కలుషిత నీటితో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో సిఎచ్ఓ, వేణుగోపాలకృష్ణ, ఎచ్ఎ,నాగేష్, ఆశా కార్యకర్త ధనలక్ష్మి పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య సేవలు మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మేడిపల్లి లో డిఫెన్స్ మద్యాన్ని బ్లాక్ లో విక్రయిస్తున్న మాజీ సైనికుడి అరెస్ట్..



**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
డిఫెన్స్ కోటాలో తనకు వచ్చిన మిలిటరీ మద్యాన్ని బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తున్న మాజీ సైనికుడిని మల్కాజిగిరి ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం కు చెందిన మాజీ సైనికుడు బైరు వెంకటేశ్వర్లు ఆర్మీ లో హావాల్దార్ గా పనిచేసి రిటైర్ అయ్యి మేడిపల్లి మండలం పర్వతాపూర్ లక్ష్మీనగర్ లో నివాసం ఉంటున్నాడు. కాగా తన కోటాలో వచ్చే మిలిటరీ మద్యాన్ని ఇతరులకు అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు మల్కాజిగిరి ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్ టైని ఏఈఎస్ ముస్తఫా సిద్ధిక్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు ఇంటి పై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కర్ణాటక కు చెందిన పదకొండున్నర లీటర్ల పదిహేను డిఫన్స్ లిక్కర్ ఫుల్ బాటిల్లను స్వాధీనం చేసుకుని ఘట్కేసర్ ఎక్సయిజ్ సీఐ ప్రసాద్ కు అప్పగించారు. నిందితుడు వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్కేసర్ ఎక్సయిజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

# కాకుమాను రాజశేఖర్‌కు నివాళులు అర్పించిన మందకృష్ణ మాదిగ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
వైసీపీ అధికార ప్రతినిధి,మాజీ లిడ్ క్యాప్ చైర్మన్,మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేత కాకుమాను రాజశేఖర్ గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఎల్బీనగర్ డాక్టర్ కాలనీలో ఉన్న రాజశేఖర్ నివాసానికి ఎంఆర్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ భౌతిక దేహాన్ని చూసి మందకృష్ణ మాదిగ భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు.
అనంతరం రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన సతీమణిని ఓదార్చి, రాజశేఖర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా
రాజశేఖర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పంచుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు శ్రీనివాస్, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు బత్తిన సుధాకర్, మాదిగ ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు చిట్టిపాక అశోక్, మంద శేఖర్, రాంబాబు,క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ గోకుల్ నగర్ గణపతి లడ్డును మూడోసారి కైవసం చేసుకున్న వీరా శ్రీకాంత్ పటేల్



**ఉప్పల్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ గోకుల్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన లడ్డు వేలం పాటలో వీరా శ్రీకాంత్ పటేల్ ఒక లక్షా అరవై అయిదు వేల నూట పదహారు రూపాయలకు కైవసం చేసుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా గణపతి లడ్డు ను దక్కించుకోవడం ఆనందంగా ఉందని శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకాంత్ పటేల్ కు ఘనంగా సన్మానించారు.

# మీర్‌పేట్ యువ క్రికెటర్

# అక్కి ఆశ్రిత గౌడ్‌కు అరుదైన అవకాశం..

### హైదరాబాద్ అండర్-19 మహిళల జట్టులో చోటు.. బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే టీ20 పోటీలకు ఎంపిక..

### కఠోర సాధనతో లక్ష్యాన్ని చేరుకున్న ఆశ్రితకు అభినందనల వెల్లువ..

**మీర్‌పేట్,(ప్రజావినికిడి):**
మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన యువ క్రికెటర్ అక్కి ఆశ్రిత గౌడ్ తన ప్రతిభతో మరో కీలక మైలురాయిని అధిగమించింది. అండర్-19 మహిళల క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-19 మహిళల టీ20 పోటీలకు హైదరాబాద్ జట్టులో చోటు దక్కించుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, కోచ్‌లు,సహచర క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న ఆశ్రిత గౌడ్ ఆటపై ఉన్న మక్కువను లక్ష్యంగా మార్చుకుని నిరంతరం సాధన కొనసాగించింది. చదువుతో పాటు క్రికెట్‌కు సమయం కేటాయిస్తూ, శిక్షణలో క్రమశిక్షణ పాటిస్తూ తన ఆటతీరును మెరుగుపరుచుకుంది. స్థానిక స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో పాల్గొంటూ అనుభవాన్ని పెంచుకున్న ఆమె,తన ప్రతిభను క్రమంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనకు తోడు కోచ్‌ల మార్గదర్శకత్వం ఆశ్రిత ఎదుగుదలకు దోహదపడింది.

#### కఠోర సాధనకు దక్కిన గుర్తింపు

క్రికెట్‌లో అవకాశాలు ఒక్కరోజులో రావని,వాటి వెనుక నిరంతర సాధన,ఓర్పు, కఠోర శ్రమ ఉంటాయని ఆశ్రిత ప్రయాణం చాటిచెబుతోంది. శిక్షణ సమయంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, తనలోని లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగిన ఆశ్రితకు ఇప్పుడు హైదరాబాద్ అండర్-19 జట్టులో చోటు దక్కడం ఆమె ప్రతిభకు లభించిన గుర్తింపుగా క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే అండర్-19 మహిళల



టీ20 పోటీల్లో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించడం ఆశ్రిత కెరీర్‌లో ముఖ్యమైన మలుపుగా నిలవనుంది. ఈ స్థాయి పోటీల ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం యువ క్రీడాకారిణులకు లభిస్తుంది. దీంతో ఆశ్రిత కూడా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

#### బాలికలకు స్ఫూర్తిగా ఆశ్రిత

మహిళల క్రికెట్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఓ యువ క్రీడాకారిణి హైదరాబాద్ అండర్-19 జట్టులో స్థానం సంపాదించడం స్థానికంగా ప్రత్యేకంగా నిలిచింది. ముఖ్యంగా క్రికెట్‌పై ఆసక్తి ఉన్న బాలికలకు ఆశ్రిత విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల మార్గదర్శకత్వం, క్రీడాకారిణి పట్టుదల కలిస్తే బాలికలు కూడా క్రికెట్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే నమ్మకాన్ని ఆమె ప్రయాణం కలిగిస్తోంది.

#### కుటుంబ సభ్యులు, కోచ్‌ల హర్షం

ఆశ్రిత గౌడ్ హైదరాబాద్ అండర్-19 మహిళల జట్టుకు ఎంపికైన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఆమె చూపిన ఆసక్తి, సాధన,ఆట పట్ల అంకితభావం ఇప్పుడు ఫలించిందని వారు పేర్కొన్నారు. ఆశ్రితకు శిక్షణ అందించిన కోచ్‌లు,సహచర క్రీడాకారులు కూడా ఆమెను అభినందించారు. రాబోయే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన చేసి హైదరాబాద్ జట్టుకు విజయాలు అందించాలని ఆకాంక్షించారు. మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారిణి బీసీసీఐ ఆధ్వర్యంలోని అండర్19 మహిళల టీ20 పోటీల్లో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుండటంతో స్థానికంగా కూడా ఆశ్రితకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకుని భారత మహిళల క్రికెట్‌లో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో ఆశ్రిత ముందుకు సాగాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.